దేశంలో స్థిరాస్తి రంగం శరవేగంగా విస్తరిస్తోంది. వ్యవసాయం తర్వాత ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తోంది రియల్ ఎస్టేటే. భవిష్యత్తులో ఇందులో మరిన్ని ఉద్యోగాలు లభిస్తాయని నిపుణుల అంచనా. ఐటీఐ, ఒకేషనల్, డిప్లొమా, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో కోర్సులు పూర్తిచేసుకున్నవారు ఈ రంగంలో ఆకర్షణీయ వేతనాలతో దూసుకుపోవచ్చు.

స్థిరాస్తి.. ఉపాధి జాస్తి!

భారత ఆర్థిక వ్యవస్థకు రియల్ ఎస్టేట్ కీలకం. సుమారు 7 కోట్ల మంది ఇందులో ఉపాధి పొందుతున్నారు. 2025 నాటికి దేశ జీడీపీలో దీని వాటా 13 శాతానికి చేరుతుందని అంచనా. రియల్ ఎస్టేట్ అంటే ఇళ్ల నిర్మాణం ఒక్కటే కాదు. ఇల్లు ఇందులో ఒక భాగం మాత్రమే. స్మార్ట్ సిటీలు, బిజినెస్ హబ్‌లు, ఎకనమిక్ జోన్లు, డేటా సెంటర్లు, షాపింగ్ మాల్స్, గేటెడ్ కమ్యూనిటీలు, లగ్జరీ విల్లాలు, ప్రీమియం అపార్ట్‌మెంట్లు... నగరాల్లో ఏ వైపు చూసినా కనిపించేవి ఇవే!

ప్రస్తుతం నగరాలతోపాటు పెద్ద పట్టణాల్లో ఆకాశ హర్మ్యాలు ఆకర్షిస్తున్నాయి. సొంత గూడును కోరుకోవడం, చిన్న కుటుంబాలకు ప్రాధాన్యం పెరగడం, ఆదాయంతోపాటు ఆదాయ మార్గాలు విస్తరించడం, పట్టణీకరణ, పలు ఇతర రంగాలు గణనీయంగా వృద్ధి చెందడం, పెట్టుబడులు పెరగడం, ప్రధానమంత్రి ఆవాస యోజన, కొత్త కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు నెలకొల్పడం, సరసమైన వడ్డీకి సులువుగా రుణాలు లభించడం..తదితర కారణాలతో స్థిరాస్తి రంగం ఆకాశమే హద్దుగా ఎదుగుతోంది.

అర్బన్ ప్లానింగ్, ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్, హౌసింగ్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ - ఇవన్నీ స్థిరాస్తి పరిధిలోకే వస్తాయి. సివిల్ ఇంజినీర్లు, స్ట్రక్చరల్ ఇంజినీర్లు, కన్‌స్ట్రక్షన్ మేనేజర్లు, ప్రాపర్టీ అసెసర్లు, లీగల్ అడ్వైజర్లు, ల్యాండ్ సర్వేయర్లు, ఆర్కిటెక్ట్‌లు, టౌన్ ప్లానర్లు, సేల్స్ మేనేజర్లు... ఇలా పలు రకాల హోదాలతో ఉద్యోగాలు ఈ రంగంలో ఉన్నాయి. ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, వెల్డర్లు, గార్డెనర్లు, బ్రిక్ లేయర్లు, ఆన్‌సైట్ ఇంజినీర్లు, ఇంటీరియర్ డిజైనర్లు, క్వాలిటీ సర్వేయర్లు, ఫెసిలిటీ మేనేజర్లు, ఎలక్ట్రికల్ ఇంజినీర్లు.. ఇలా పలు రకాల నిపుణుల సేవలు అవసరం. ఈ విభాగంలో కోర్, నాన్ కోర్, స్పెషలైజ్డ్ ప్రొఫెషనల్స్‌తోపాటు స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ వ్యక్తులూ సేవలు అందించవచ్చు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసుకున్నవారు రాణించగలరు. స్థిరాస్తి రంగానికి అవసరమైన సేవలు అందించడానికి విద్యా సంస్థలూ వెలిశాయి. వీటిలో పలు కోర్సులూ ఉన్నాయి. వాటిని పూర్తిచేసుకున్నవారు సంబంధిత విధుల్లో దూసుకువెళ్లవచ్చు. కొన్ని చోట్ల ప్రాంగణ నియామకాలకూ అవకాశం ఉంది.

- ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు రాణించగలరు.
- స్థిరాస్తి రంగానికి అవసరమైన సేవలు అందించడానికి విద్యా సంస్థలూ వెలిశాయి. వీటిలో పలు కోర్సులూ ఉన్నాయి. వాటిని పూర్తిచేసుకున్నవారు సంబంధిత విధుల్లో దూసుకువెళ్లవచ్చు.

అవకాశాలిలా..

స్థిరాస్తి రంగంలో కోర్ (డొమైన్) ఉద్యోగాలతోపాటు మార్కెటింగ్, సేల్స్, ఫైనాన్స్, స్ట్రాటజీ, అడ్మినిస్ట్రేటివ్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో పెద్ద ఎత్తున మానవ వనరుల సేవలు అవసరం. రియల్ ఎస్టేట్ బిజినెస్ మేనేజ్‌మెంట్, రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ అండ్ సేల్స్ కోర్సులు పూర్తిచేసినవాళ్లు మేటి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. సివిల్ ఇంజినీర్లు రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ లేదా కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ లేదా స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సులు చేయడం ద్వారా పెద్ద నిర్మాణ సంస్థల్లో ప్రవేశించవచ్చు. లోధా, గోద్రెజ్ ప్రాపర్టీస్, డీఎల్ఎఫ్ బిల్డింగ్ ఇండియా, డీహెచ్ఎఫ్ఎల్... ఇలా పలు కార్పొరేట్ రియాల్టీ సంస్థలు నైపుణ్యమున్న వారికి ఆకర్షణీయ వేతనాలు అందిస్తున్నాయి. టాటా హౌసింగ్, రహేజా యూనివర్సల్, లార్సెన్ అండ్ టుబ్రో, పంజ్ లాయిడ్ గ్రూప్, 99 యాకర్స్, మ్యాజిక్ బ్రిక్స్, ఇండియా ప్రాపర్టీ, ఇండియా హౌసింగ్.. తదితర సంస్థలెన్నో క్యాంపస్ నియామకాలూ చేపడుతున్నాయి. రియల్ ఎస్టేట్‌పై 250 అనుబంధ పరిశ్రమలూ ఆధారపడి ఉన్నాయి. అందువల్ల దాని ప్రభావం వీటిపైనా పడి, మరిన్ని అవకాశాలు దక్కుతాయి.

హోదాలు.. నైపుణ్యాలు..

రియల్ ఎస్టేట్ బ్రోకర్, అప్రయిజర్, ఫెసిలిటీ మేనేజర్, ప్రాపర్టీ మేనేజర్, ఇన్వెస్టిమెంట్ కన్సల్టెంట్, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఎక్స్‌పర్ట్, లీజింగ్ కన్సల్టెంట్, లీగల్ అసిస్టెంట్, లోన్ ఆఫీసర్, మార్ట్‌గేజ్ బ్రోకర్, రియల్టర్.. ఇలా పలు హోదాలున్నాయి. స్థిరాస్తి రంగంలో రాణించడానికి.. డొమైన్ పరిజ్ఞానం, సాంకేతిక అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఓపికగా వినడం, చర్చించి, ఒప్పించ గలిగే సామర్థ్యం ఉండాలి.

ఈ రంగంలో సేవలందిస్తోన్నవారిని 3 కేటగిరీలుగా వర్గీకరించవచ్చు.

స్పెషలైజ్డ్ ప్రొఫెషనల్స్: వాల్యూయర్స్, క్వాంటిటీ సర్వేయర్లు, ఫెసిలిటీ మేనేజర్లు, ప్రాపర్టీ మేనేజర్లు, సస్టయినబుల్ డెవలప్‌మెంట్ ఎక్స్‌పర్టులు

కోర్ ప్రొఫెషనల్స్: ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్‌లు, ప్లానర్లు

నాన్ కోర్ ప్రొఫెషనల్స్: మేనేజ్‌మెంట్ నిపుణులు, అడ్మినిస్ట్రేటర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, మార్కెటింగ్ ప్రొఫెషనల్స్, సేల్స్ ప్రొఫెషనల్స్, ప్రాజెక్ట్ మేనేజర్లు, ఫైనాన్స్ ఎనలిస్టులు, లాయర్లు, ఎలక్ట్రికల్ ఇంజినీర్లు, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్లు.

2030 నాటికి...

రియల్ ఎస్టేట్ రంగంలో పది కోట్ల మందికి ఉపాధి దక్కుతుంది. ప్రస్తుతం 22 లక్షల మంది ఇంజినీర్లు రియల్ సేవలు అందిస్తున్నారు. వీరి సంఖ్య అప్పటికి 33 లక్షలకు పెరుగుతుంది.

యంత్రాలు, మెకానికల్ ఇంజినీరింగ్ గురించి తెలిసినవారికి, నిర్మాణ రంగానికి సంబంధించిన సాంకేతికత, సాఫ్ట్‌వేర్‌లో ప్రావీణ్యం ఉన్నవారికీ ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

టెక్నీషియన్/ఫోర్‌మెన్ విభాగంలో 22.71 లక్షల నుంచి 38.11 లక్షలకు ఉపాధి పెరగనుంది. క్లరికల్ ఉద్యోగాలు 19.16 లక్షల నుంచి 29.08 లక్షలకు చేరతాయి. నైపుణ్యం ఉన్న ఉద్యోగులు 68.84 లక్షల నుంచి 1.05 కోట్లకు విస్తరిస్తారు.

ఆ సమయానికి ఒక ట్రిలియన్ యూఎస్ డాలర్లకు స్థిరాస్తి రంగం విస్తరిస్తుంది.

ఏయే విధులు?

రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ బ్రోకర్: వీరు ఇల్లు, ఇళ్ల స్థలాల అమ్మకాల్లో పాలు పంచుకుంటారు. అమ్మే వారికి, కొనేవారికి మధ్య బేరసారాలు జరగడంలో కీలకంగా వ్యవహరిస్తారు. బేరం కుదిరితే కొంత కమీషన్ తీసుకుంటారు.

కమర్షియల్ రియల్ ఎస్టేట్ బ్రోకర్: వీరు వాణిజ్య సముదాయాలు, మాల్స్, కార్యాలయాలకు కావాల్సిన స్థలం సమకూర్చడం, అద్దెకివ్వడం, పెద్ద భవనాలను సంస్థలకు అమ్మడం, అద్దెకివ్వడం లాంటి లావాదేవీల్లో పాలు పంచుకుంటారు.

రియల్ ఎస్టేట్ అప్రయిజర్: వీరు ఇల్లు, ప్లాట్లు, వాణిజ్య స్థలాల మార్కెట్ విలువను మదింపు చేస్తారు. అప్రయిజల్ ఫర్మ్‌లు, బ్యాంకు, ప్రైవేటు ఇన్వెస్టర్ల తరపున పనిచేస్తారు.

ప్రాపర్టీ మేనేజర్: వీరు ప్రాపర్టీ ఫర్మ్ తరపున పని చేస్తారు. సంస్థ తరపున స్థలం యజమానితో మాట్లాడి, కొంత పెట్టుబడి పెట్టి నిర్మాణం చేపడతారు. దాన్ని లీజు, అద్దెకు ఇస్తారు.

ఫెసిలిటీస్ మేనేజర్: రెసిడెన్షియల్ టౌన్‌షిప్పులు, ఆఫీస్‌లు, బిల్డింగ్స్, మాల్స్ లాభదాయకంగా ఉండడానికి కావాల్సిన జాగ్రత్తలు తీసుకుంటారు. వాటిని వినియోగదారులకు లీజు, అద్దెకు ఇస్తారు. ఆ నిర్మాణం సాఫీగా కొనసాగేలా చూసుకుంటారు. పనులను పర్యవేక్షిస్తారు.

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ కన్సల్టెంట్: స్థిరాస్తి మార్కెట్‌పై వీరికి పట్టు ఉంటుంది. పెట్టుబడిదారులకు తగు సలహాలిస్తారు. ప్రాంతాలవారీ ఎంత వరకు వెచ్చించవచ్చు, అందుకు కారణాలు.. సమగ్రంగా తెలుపుతారు.

ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఎక్స్‌పర్ట్: వీరు ప్రాజెక్టు పునాది రాళ్ల నుంచి తుది రూపు వచ్చే వరకు అందులో పాలు పంచుకుంటారు. ప్రారంభంలోనే వినియోగదారులను ఆకర్షించి పూర్తికాకముందే అమ్ముడుపోయేలా చేస్తారు. నిర్మాణదారులకు ఆ ప్రాజెక్టు అభివృద్ధిపై సూచనలిస్తారు. బ్లూ ప్రింట్ నుంచి ఆఖరు అంకం వరకు అన్ని వ్యవహారాలూ చూసుకుంటారు.

ఇవీ సంస్థలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్ (నిక్మార్): ఈ విభాగంలో ప్రాధాన్య సంస్థ ఇదే. దీనికి పుణె, హైదరాబాద్, దిల్లీ, గోవాలో క్యాంపస్‌లు ఉన్నాయి. వాటిలో పలు రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇటీవలే ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. డిసెంబరు 17లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సులు పూర్తిచేసినవారు, చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారు అర్హులు.

కోర్సులు: ఎంబీఏ: అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్/ సస్టెయినబుల్ ఎనర్జీ మేనేజ్‌మెంట్/ ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబిలిటీ/ ఫ్యామిలీ బిజినెస్ అండ్ ఆంత్రపెన్యూర్‌షిప్/ అడ్వాన్స్‌డ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్/ రియల్ ఎస్టేట్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్. క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లొమా, మాస్టర్ ఆఫ్ అర్బన్ ప్లానింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, ఎంటెక్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, బీటెక్ సివిల్ ఇంజినీరింగ్.. తదితర కోర్సులు ఈ సంస్థ అందిస్తోంది.

అమెటీ యూనివర్సిటీ– ఆర్ఐసీఎస్ స్కూల్ ఆఫ్ బిల్ట్ ఎన్విరాన్‌మెంట్‌లో ఎంబీఏ: రియల్ ఎస్టేట్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ ఎకనమిక్స్ అండ్ క్వాంటిటీ సర్వేయింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్; పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, బీబీఏ: రియల్ ఎస్టేట్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోర్సులు చదువుకోవచ్చు.

నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ హైదరాబాద్‌లో.. ఐదో తరగతి, ఎనిమిది, పది, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్హతలతో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, ముంబై సర్టిఫయింగ్ బ్రోకర్స్ కోర్సు అందిస్తోంది. **అమెరికన్ అకాడెమీ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్** భారతీయ విభాగం చార్టర్డ్ రియల్ ఎస్టేట్ ప్రొఫెషనల్ పేరుతో సర్టిఫికేషన్ కోర్సు నడుపుతోంది. **టెరీ యూనివర్సిటీలో..** ఎంబీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎంటెక్ అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ కోర్సులు ఉన్నాయి.

నిరెమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రియల్ ఎస్టేట్ అండ్ ఫైనాన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రియల్ ఎస్టేట్, అన్సాల్ యూనివర్సిటీ పలు స్థిరాస్తి కోర్సులు అందిస్తున్నాయి.

వీటి మధ్య తేడా ఏమిటి?

సోషియాలజీ, సోషల్‌వర్క్‌లలో వేర్వేరుగా పీజీ కోర్సులుంటాయా? వీటి మధ్య తేడా ఏమిటి?

- సాయిప్రకాశ్

■ సోషియాలజీ, సోషల్ వర్క్‌లో రెండు వేర్వేరు పీజీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. సోషల్ వర్క్‌లో పీజీ చేయాలంటే ఎంఎస్‌డబ్ల్యూ (మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్), సోషియాలజీలో పీజీ చేయాలంటే ఎంఏ సోషియాలజీ చదవాలి. సాధారణంగా సోషియాలజీ ప్రోగ్రామ్‌లో సమాజం, కుటుంబం, వివాహ వ్యవస్థ గురించి ఉంటుంది. సామాజిక సంబంధాలు, సామాజిక ఆలోచనా విధానం, సంస్కృతి, అభివృద్ధి సామాజిక కోణం, కులం, మతం, పట్టణీకరణ, వలసలు, వివాహం, కుటుంబం, సామాజిక పరిశోధన లాంటి అంశాలుంటాయి. ఇక సోషల్ వర్క్ విషయానికొస్తే- కమ్యూనిటీ వర్క్, చైల్డ్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్, లేబర్ వెల్ఫేర్, అంటరానితనం, పునరావాసం, గ్రామీణాభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లాంటి అంశాలు భాగం. సోషియాలజీలో పీజీ చేసినవారు అధ్యాపకులుగా, పరిశోధకులుగా, సోషల్ వర్కర్లుగా స్థిరపడవచ్చు. సోషల్ వర్క్‌లో పీజీ చేసినవారు సోషల్ వర్కర్, ఫామిలీ కౌన్సెలర్, హాస్పిటల్ కౌన్సెలర్, డీఅడిక్షన్ కౌన్సెలర్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ హోదాల్లో విధులు నిర్వహించవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

పాఠాలను జాగ్రత్తగా వినడంతో పాటు.. ఏవైనా సందేహాలు ఉంటే అడిగి తెలుసుకోవడం. ఆలోచనలు, అభిప్రాయాలను పైకి చెప్పగలడం, అర్థవంతంగా రాయలగడం.. ఇవన్నీ కూడా భావవ్యక్తీకరణ నైపుణ్యం కిందికే వస్తాయి. విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ ఎంతో అవసర మైన ఈ సామర్థ్యానికి ఎలా మెరుగులు దిద్దుకోవచ్చో తెలుసుకుందామా...

మీ భావ ప్రకటన మెరుగ్గా ఉంటోందా?

తరగతిలో కొన్నిసార్లు.. వర్తమాన ఆర్థిక, సాంఘిక, రాజకీయ అంశాలపై బృంద చర్చలను నిర్వహిస్తుంటారు. వీటిల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా మీ అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేయడాన్ని నేర్చుకోగలుగుతారు. అలాగే బృంద సభ్యుల అభిప్రాయాలతో కొన్నిసార్లు మీరు ఏకీభవిస్తారు.. మరికొన్నిసార్లు విభేదిస్తారు కూడా. ఇలాంటప్పుడు.. మీ అభిప్రాయానికి బలాన్ని చేకూర్చే అంశాలను జోడించి వాదించాల్సి వస్తుంది. ఇలా మీ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తంచేయగలిగే నేర్పు అలవడుతుంది.

- విద్యాసంస్థల్లో కొన్ని ప్రత్యేక వేదికల సందర్భంగా నిర్వహించే వక్తృత్వ పోటీల్లో పాల్గొనడం ద్వారా మీ అభిప్రాయాలు, ఆలోచనలను సూటిగా, స్పష్టంగా వివరించగలుగుతారు. ఈ పోటీల్లో భాగంగా అభిప్రాయాలను నిర్దిష్ట సమయంలోగా, నలుగురినీ ఆకట్టుకునే విధంగా వెల్లడించగలగాలి. తరచుగా వీటిలో పాల్గొనడం వల్ల భావవ్యక్తీకరణ సామర్థ్యానికి మెరుగులు దిద్దుకోవచ్చు. అలాగే వివిధ అంశాలైన ప్రజెంటేషన్లు ఇవ్వడానికీ ఈ నైపుణ్యం తోడ్పడుతుంది.

పాడ్ కాస్ట్‌లు

ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే కొన్ని ఉచిత పాడ్‌కాస్ట్‌లను వినటం వల్ల వివిధ అంశాలపై చర్చించే నేర్పు అలవడుతుంది. రేడియోలో వర్తమానాంశాలపై చర్చలు వింటూ, టీవీలో చూస్తూ కూడా భావప్రకటనకు మెరుగులు దిద్దుకోవచ్చు. వివిధ అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను ఎలా వ్యక్తంచేస్తున్నారు.. వాటిని ఎలా సమర్థించుకుంటున్నారు, అలాగే కొన్నిసార్లు ఇతరుల అభిప్రాయాలతో ఎలా విభేదిస్తున్నారు.. మొదలైన వాటిని జాగ్రత్తగా గమనించొచ్చు. ఇంటర్వ్యూలో భాగంగా కొన్నిసార్లు బృంద చర్యల్లో పాల్గొనాల్సీ రావొచ్చు. అలాంటప్పుడు మీ వాదనను సమర్థంగా వినిపించగలుగుతారు.

- ఆసక్తి ఉంటే.. బ్లాగర్‌గా అభిప్రాయాలు పంచుకోవటమూ మంచిదే. వర్తమానాంశాలపై వ్యక్తిగత అభిప్రాయాలను ఆకట్టుకునే విధంగా రాయటం, నిత్యజీవితంలో మీకు ఎదురైన కొన్ని అనుభవాలు, ఎదుర్కొన్న సంఘటనలను ఆసక్తికరంగా వివరించటం, విహారయాత్రలు చేస్తే ఆ ప్రదేశాల్లో మీరు పొందిన ఆనందానికి అక్షరరూపం కల్పించటం.. ఇవన్నీ చేయవచ్చు.

పబ్లిక్ స్పీకింగ్ కోర్సులు

ఆన్‌లైన్ వేదికల్లో అందుబాటులో ఉండే పబ్లిక్ స్పీకింగ్ కోర్సుల్లోనూ చేరొచ్చు. దీంట్లో భాగంగా.. ఒత్తిడికి గురికాకుండా ఎలా మాట్లాడాలి, ఒక అంశాన్ని గురించి చర్చించేటప్పుడు.. ప్రసంగం మొదలు పెట్టినప్పటి నుంచి చివరి వరకూ ఒకే స్థాయిలో కాకుండా.. విషయ తీవ్రతను బట్టి గొంతు పెంచడం లేదా మెల్లగా మాట్లాడటం లాంటివి చేయాల్సిన అవసరం ఉంటుంది. అందుకే స్వరస్థాయిలను ఎలా నియంత్రించాలనేదీ వివరిస్తారు. అలాగే మాట్లాడేటప్పుడు శరీర భాషకూ ప్రాధాన్యం ఉంటుంది. బాడీలాంగ్వేజ్ ఎలా ఉండాలనేదీ బోధిస్తారు. అవకాశం ఉన్నప్పుడు వర్క్‌షాప్‌లకు హాజరుకావడం ద్వారానూ భావవ్యక్తీకరణ నైపుణ్యాన్ని పెంచుకోవచ్చు.

- కొన్ని ప్రత్యేక సందర్భాల్లో లేదా సెలవుల్లో సినిమాలు చూసే అలవాటు చాలామంది విద్యార్థులకు ఉంటుంది కదా. భావప్రకటనాసక్తి ఉంటే.. వాటిల్లోని పాత్రల సంభాషణ తీరూ పరిశీలించొచ్చు. ఉదాహరణకు హీరో ఇంటర్వ్యూకు హాజరయ్యే సన్నివేశమే ఉందనుకుందాం. అప్పుడు అతడి హావభావాలూ, శరీరభాష, సభ్యులు అడిగే ప్రశ్నలకు అతడు స్పందించే విధానం, సమాధానాలు చెప్పే తీరు... ఇలాంటివన్నీ పరిశీలించవచ్చు.

ఒక్క విద్యార్థిగానే కాదు.. జీవితంలోని ప్రతి దశలోనూ ఈ నైపుణ్యంతో ఎంతో అవసరం ఉంటుంది. మీరు ఉండే ప్రదేశాన్ని బట్టి.. మీ పాత్ర కూడా మారిపోతూ ఉంటుంది. కుటుంబంతో ఉన్నప్పుడు మీరు కుటుంబసభ్యుల్లో ఒకరు. అలాగే ప్రయాణికులు, పర్యాటకులు, కొనుగోలుదారులు, అమ్మకందారులు, వినియోగదారులు, ప్రేక్షకులు, పాఠకులు.. ఇలా ఎన్నో రకాల పాత్రలనూ పోషిస్తారు. ఏ పాత్రలో ఒదిగినా.. స్వేచ్ఛగా భావాలను వెల్లడించగలిగే నేర్పు ఎంతో అవసరం.

నోటిఫికేషన్స్

ఉద్యోగాలు

ఆప్కాబ్, విజయవాడలో స్టాఫ్ అసిస్టెంట్

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ స్టాఫ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
స్టాఫ్ అసిస్టెంట్: 35 పోస్టులు
అర్హత: డిగ్రీతో పాటు తెలుగు/ ఆంగ్ల భాషలు తెలిసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం.
వయసు: 01.10.2023 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
పే స్కేల్: రూ.17,900-రూ.47,920.
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్‌తో
దరఖాస్తు ఫీజు: జనరల్/ బీసీలకు రూ.700. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు రూ.500.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 21.10.2023.
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: నవంబర్, 2023.
వెబ్‌సైట్: https://apcob.org/

వైద్య కళాశాలల్లో అధ్యాపక పోస్టులు

ప్రభుత్వ వైద్య విద్య కళాశాలలు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో ఒప్పంద ప్రాతిపదిక అధ్యాపకుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం ప్రకటన విడుదలచేసింది. ఏడాది తర్వాత అవసరాన్ని బట్టి పదవీ కాలాన్ని పెంచుతారు.
ఖాళీలున్న ప్రభుత్వ వైద్య విద్య కళాశాలలు: వికారాబాద్, జనగామ, కరీంనగర్, కుమరంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, ఖమ్మం, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల.
పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
విభాగాలు: అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మాకాలజీ, ఫాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్.
అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు బోధన, పరిశోధనానుభవం ఉండాలి.
వయసు: 69 ఏళ్లు మించకూడదు.
వేతనం: ప్రొఫెసర్‌కు రూ.1.90 లక్షలు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1.50 లక్షలు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1.25 లక్షలు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలకు అదనంగా మరో రూ.50 వేలు చెల్లిస్తారు. **ఎంపిక:** పీజీ మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.
దరఖాస్తు: ధ్రువపత్రాలను స్కాన్ చేసి మెయిల్ ద్వారా పంపాలి.
ఇ-మెయిల్: dmerecruitment.contract@gmail.com
చివరి తేదీ: అక్టోబరు 15 **కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 20

వాక్-ఇన్స్

ఐఐసీటీలో..

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ.. వివిధ ప్రాజెక్టు విధుల్లో తాత్కాలిక ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం పోస్టులు: 24.
విభాగాలు: ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్.
అర్హత: సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణత **ఎంపిక:** ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ఆధారంగా.
వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేదీలు: 12.10.2023, 13.10.2023.
వేదిక: ఐఐసీటీ, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://www.iict.res.in/CAREERS

ప్రాజెక్ట్ అసోసియేట్

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ.. వివిధ ప్రాజెక్టు విధుల్లో భాగంగా తాత్కాలిక ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. ప్రాజెక్ట్ అసోసియేట్-1: 01 పోస్టు
2. ప్రాజెక్ట్ అసోసియేట్-2: 02 పోస్టులు
అర్హత: ఎంఎస్సీ (కెమిస్ట్రీ/ పాలిమర్ సైన్స్), ఎంటెక్ (కెమికల్ ఇంజినీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 35 సంవత్సరాలు మించకూడదు.
వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేదీ: 15.10.2023.
వేదిక: ఐఐసీటీ, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://www.iict.res.in/CAREERS

ప్రవేశాలు

బీఎన్‌వైఎస్ కోర్సు

విజయవాడలోని డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు అనుబంధంగా ఉన్న కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి బీఎన్‌వైఎస్ కోర్సులో ప్రవేశానికి ప్రకటన వెలువడింది.
కళాశాలలు, సీట్లు..
1. కేర్ యోగా, నేచురోపతి మెడికల్ కాలేజీ(బాపట్ల): 50 సీట్లు
2. పతంజలి మహర్షి నేచురోపతి అండ్ యోగా మెడికల్ కాలేజీ, గుంతకల్: 50 సీట్లు
అర్హత: 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) **వయసు:** 31-12-2023 నాటికి 17 సంవత్సరాలు నిండాలి.. **ఎంపిక:** ఇంటర్ మార్కులతో
**అప్